

జై భీమ

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 337 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 08, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్



ప్రజాస్వామ్యాన్ని పాలిస్తుంది ఎవరు....
రక్షించాల్సింది ఎవరు

12 ఏళ్లుగా ప్రభుత్వాన్ని పాలిస్తూ
రోడ్లపై ర్యాలీలు చేస్తున్నారు

ప్రజాస్వామ్యానికి రక్షణ లేకుండా చేశారు

ప్రజాస్వామ్యం ఎప్పుడు ప్రజలదే..... పాలకులది కాదు

నయవంచకులైన పాలకులే ది
ప్రజాస్వామ్యాన్ని పతనం చేస్తున్నారు

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా చట్టాలను
రూపొందించుకుంటున్నారు

దేశం ఏమైపోయినా పర్లేదు
ఎవరు మాట్లాడొద్దు ఎవరు ప్రశ్నించద్దు

అసలు కైతే దేశంలో ప్రజాస్వామ్యం అనేదానికి
విలువిస్తున్నారాలి

ప్రతిపక్షాలపై ధర్నాలు చేసే ప్రభుత్వాలను
పిచ్చోళ్ళన్న తప్పేంలేదు

ప్రజాస్వామ్యంపై పట్టింపు
లేదు ప్రజలపై మమకారం లేదు

డాక్టర్ బరిగెల శివ



ప్రజాస్వామ్యం..
పరువు తీస్తున్నారు !

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన పాలకులే దాని విలువలను కాలరాస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాస్వామ్యం పాలకుల సొత్తు కాదు.. అది ప్రజల హక్కు, ప్రజల ఆస్తి. దేశాన్ని 12 ఏళ్లుగా పాలిస్తున్న ప్రభుత్వం ప్రజాస్వామ్య పరిరక్షణ పేరుతో ర్యాలీలు నిర్వహించడం విడ్డూరంగా ఉందని డాక్టర్ బరిగెల శివ విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల విక్రయాలు, ప్రజా సమస్యల నిర్లక్ష్యం దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ వ్యవస్థలు, చట్టాలు, న్యాయస్థానాల స్వతంత్రతపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా చట్టాలు రూపొందుతున్నాయన్న ఆరోపణలపై పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నేరచరిత్ర ఉన్నవారికి రాజకీయాల్లో అవకాశాలు దక్కుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల విధానాలపై ప్రతిపక్షాలు, మేధావులు, విద్యార్థులు ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం కూడా రోడ్లపైకి రావడం ఏమిటని నిలదీశారు. హైదరాబాద్‌లో అమిత్ షా నిర్వహించిన పాదయాత్ర, ప్రజాస్వామ్య పరిరక్షణ నినాదాలపై ప్రశ్నలు సంధించారు. ప్రజాస్వామ్య హక్కులను గౌరవించి, ప్రజలకు జవాబుదారీగా పాలన సాగించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

దీపావళి అసలు చరిత్ర ఇదేనా?

తరతరాలుగా చెబుతున్న కథల వెనుక ప్రశ్నలు..
బౌద్ధ సంప్రదాయాల నుంచి పురాణాల వరకు!
డాక్టర్ బరిగెల శివ

3

17 ఏళ్ల నిరీక్షణకు తెర.. కూకట్‌పల్లి ఫ్లాట్లపై సుప్రీం కీలక ఆదేశాలు

కూకట్‌పల్లి ఫ్లాట్లపై 17 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం
101 మందికి నవంబర్ 23లోగా
రిజిస్ట్రేషన్ చేయాలని సుప్రీం ఆదేశం
కొనుగోలుదారులకు అత్యున్నత
న్యాయస్థానంలో భారీ ఊరట
14 శాతం వడ్డీ వసూలుపై హైకోర్టుదే
తుది నిర్ణయమని స్పష్టీకరణ
కేసు తేలే వరకు ఆస్తులు అమ్మరాదని
ఇరువర్గాలకు ఆంక్షలు

2



ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే..

రైతులకు సీఎం రేవంత్ కీలక హెచ్చరిక!
సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానన్న సీఎం రేవంత్
ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులుంటాయని ప్రజలకు అప్రమత్తం
ప్రాజెక్టుల్లోని నీళ్లు తాగునీటికే సరిపోతాయని స్పష్టీకరణ
రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచన
గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ
కేటీఆర్‌పై విమర్శలు

7





కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్

4

కొడంగల్ ఎత్తిపోతలలో భారీ అవకతవకలు
జరిగాయన్న కేటీఆర్
రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు
వ్యయాన్ని పెంచారని విమర్శ
ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అంటూ తీవ్ర విమర్శ

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

పెద్దమ్మగడ్డ యూపీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య



హన్మకొండ, నవంబర్ 7(జై భీమ్ న్యూస్)

హనుమకొండ జిల్లా పెద్దమ్మగడ్డలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఫార్మసీ స్టోర్, మందుల నిల్వలు, మందుల పంపిణీ వివరాలు, వివిధ రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. మందుల నిల్వలు, పంపిణీ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం జిల్లాలో అమలవుతున్న హెచ్‌పీవీ (హెచ్.పి.వి) వ్యాక్సినేషన్ కార్యక్రమంపై సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేసి, అర్హులైన బాలికలందరికీ టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెచ్‌పీవీ టీకా ప్రాముఖ్యతపై బాలికలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. పెద్దమ్మగడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న అవుట్‌రీచ్ ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని కూడా డాక్టర్ అప్పయ్య పరిశీలించారు. టీకాల పంపిణీ, లబ్ధిదారుల హాజరు, సంబంధిత రికార్డులను తనిఖీ చేసి, వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్దేశిత ప్రణాళిక ప్రకారం కొనసాగాలని సూచించారు. అదేవిధంగా నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్.సి.డి) కార్యక్రమానికి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి, రక్తపోటు, మధుమేహం వంటి అసంక్రమిత వ్యాధులను ముందస్తుగా గుర్తించడం, పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి చికిత్స అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపుపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించేందుకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. పొగాకు వినియోగం, ధూమపానం, మద్యపానం వంటి హానికరమైన అలవాట్లకు దూరంగా ఉండాలని, సమతుల్య ఆహారం తీసుకోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధుల ముప్పును తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ అప్పయ్య వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తిస్థాయిలో సాధించాలని ఆదేశించారు.

17 ఏళ్ల నిరీక్షణకు తెర.. కూకట్‌పల్లి ఫ్లాట్లపై సుప్రీం కీలక ఆదేశాలు

కూకట్‌పల్లి ఫ్లాట్లపై 17 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం
101 మందికి నవంబర్ 23లోగా రిజిస్ట్రేషన్ చేయాలని సుప్రీం ఆదేశం
కొనుగోలుదారులకు అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఊరట
14 శాతం వడ్డీ వసూలుపై హైకోర్టుదే తుది నిర్ణయమని స్పష్టీకరణ
కేసు తేలే వరకు ఆస్తులు అమ్మరాదని ఇరువర్గాలకు ఆంక్షలు



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఫేజ్-15లో ఇళ్ల కోసం గత 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న కొనుగోలుదారులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వివాదంలో ఉన్న 101 ఫ్లాట్లను ఈ నెల 23వ తేదీలోగా కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని తెలంగాణ హౌసింగ్ బోర్డును సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లిలతో కూడిన ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వాయిదాల చెల్లింపుల్లో జాప్యం జరిగిన వారి నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయాలా? వద్దా? అనే అంశాన్ని హైకోర్టు తేల్చే వరకు వేచి చూడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, వడ్డీ వివాదం తేలే వరకు కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టకూడదని పేర్కొంటూ, తక్షణమే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టులో కేసు పరిష్కారమయ్యే వరకు ఈ ఇళ్లను ఇతరులకు విక్రయించడం లేదా బదిలీ చేయడం వంటి చర్యలు చేపట్టరాదని అటు హౌసింగ్ బోర్డుకు, ఇటు కొనుగోలుదారులకు న్యాయస్థానం ఆంక్షలు విధించింది. 2009లో హౌసింగ్ బోర్డు 'సంపూర్ణం' పథకం కింద కేపీహెచ్‌బీలో ఇళ్లను కేటాయించింది. తొలుత ఫ్లాట్ ధరను రూ.30.80 లక్షలుగా నిర్ణయించి, ఆ తర్వాత దానిని రూ.47.85 లక్షలకు పెంచడంతో వివాదం మొదలైంది. నిర్మాణంలో జాప్యం, అదనపు ధరల వసూలుపై కొనుగోలుదారులు వినియోగదారుల ఫోరం నుంచి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) వరకు న్యాయపోరాటం చేశారు. బోర్డు వైపు నుంచే జాప్యం జరిగిందని నిర్ధారించిన ఎన్‌సీడీఆర్‌సీ, కొనుగోలుదారుల నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయడం సమర్థనీయం కాదని గతంలో తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ హౌసింగ్ బోర్డు తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా.. తమ వైపు నుంచి జరిగిన ఆలస్యానికి 6 శాతం వడ్డీ చెల్లిస్తామని, అయితే కొనుగోలుదారుల నుంచి మాత్రం 14 శాతం వడ్డీ వసూలుకు అనుమతించాలని బోర్డు కోరింది. బోర్డు వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, బాధితుల 17 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలుకుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

ప్రజాస్వామ్యం "పరువు" తీస్తున్నారు

ప్రజాస్వామ్యాన్ని పాలిస్తుంది ఎవరు....
రక్షించాల్సింది ఎవరు
12 ఏళ్లుగా ప్రభుత్వాన్ని పాలిస్తూ రోడ్లపై
ర్యాలీలు చేస్తున్నారు
ప్రజాస్వామ్యానికి రక్షణ లేకుండా చేశారు
ప్రజాస్వామ్యం ఎప్పుడు ప్రజలదే..... పాలకులది కాదు
నయవంచకులైన పాలకులే
ప్రజాస్వామ్యాన్ని పతనం చేస్తున్నారు
ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా చట్టాలను
రూపొందించుకుంటున్నారు
దేశం ఏమైపోయినా పర్లేదు ఎవరు మాట్లాడొద్దు
ఎవరు ప్రశ్నించద్దు
అసలు కైతే దేశంలో ప్రజాస్వామ్యం
అనేదానికి విలువిస్తున్నారాలి
ప్రతిపక్షాలపై ధర్నాలు చేసే ప్రభుత్వాలను
పిచ్చోళ్ళన్న తప్పేంలేదు
ప్రజాస్వామ్యంపై పట్టింపు లేదు ప్రజలపై మమకారం
లేదు : డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

దేశాన్ని పాలిస్తున్న పాలకులు ప్రజాస్వామ్యాన్ని కాపాడలేకపోతున్నారని డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను రక్షిస్తే ప్రజలను రక్షించినట్లేనంటూ తెలియజేశారు. ప్రజాస్వామ్య విలువలతో కూడిన రాజకీయాలు చేయగలిగినప్పుడు ప్రభుత్వాలకు ఎదురయ్యే ఆరోపణలు గానీ ప్రభుత్వాలపై జరుగుతున్న ఉద్యమ పోరాటాలను గాని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. భారతదేశాన్ని బిజెపి ప్రభుత్వం 12 సంవత్సరాలుగా పాలిస్తున్న సందర్భంలో గత కాంగ్రెస్ పార్టీ దేశాన్ని పాలించిన విధానాలకు ప్రస్తుతం భారతదేశాన్ని బిజెపి పాలిస్తున్న విధానాలను సరిపోల్చి చూస్తూ పరిశీలిస్తుండగా దేశంలో అప్రజాస్వామికంగా కొనసాగుతున్న పాలనలో ప్రధాన ప్రభుత్వ పరిశ్రమలన్నీ అమ్మకం చేయబడ్డాయని వాటి వల్ల దేశానికి రావలసిన ఆదాయం తగ్గిపోయిందని నిలదీశారు. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న భారతదేశాన్ని రక్షించాల్సిన బాధ్యత పాలకులకు లేదా అంటూ సూటిగా నిలదీశారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏ విధమైనటువంటి పాలన కొనసాగిస్తుందో మాధ్యమాల్లో సోషల్ మీడియాలో అంతర్జాతీయ ప్రధాన మీడియాలలో యూట్యూబ్ చానల్స్ లో స్పష్టంగా వెళ్లడవుతుందని గుర్తు చేశారు. అన్ని ప్రభుత్వ శాఖలను ప్రభుత్వం చేతిలో పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సింది పోయి..... ప్రజాస్వామ్యాన్ని ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న సందర్భంలో ప్రజలు కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటు చేయడంలో తప్పేందంటూ సూటిగా అడిగారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసమే



ప్రభుత్వాలు ఏర్పాటు చేయబడతాయనే విషయాలను గమనించవలసిన వారై ఉండి పరిపాలన దక్షత దృష్ట్యా ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత నేరగకుండా ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా దేశాన్ని పాలిస్తూ ప్రజాస్వామ్యవాదులను తప్పుదోవ పట్టిస్తున్నారని పూర్తిస్థాయిలో విమర్శించారు.

రక్షణ వలయాలు రక్షించలేకపోతున్నాయి..

ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన ప్రభుత్వ పాలకులు, న్యాయస్థానాలు, చట్టాలు దేశంలోని ప్రజాస్వామ్యానికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించ లేకపోతున్నాయని అన్నారు.చట్టాలు గాని న్యాయస్థానాలు గాని ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసం తమ వంతు కర్తవ్యాన్ని నెరవేర్చడంలో భాగంగా ప్రతి సందర్భాన్ని బట్టి కృషి చేయాలనే ప్రయత్నాలు చేస్తున్నప్పటికిని న్యాయస్థానాలు, చట్టాలు ప్రభుత్వాలు ఆధీనంలో పనిచేస్తున్నందున కేంద్ర ప్రభుత్వమే న్యాయస్థానాలను చట్టాలను బలవంతపు ఒత్తిడిల చేత ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా కొనసాగించబడే విధంగా పాలిస్తూ న్యాయస్థానాలను, చట్టాలను, ప్రభుత్వ ఆధీనంలో పెట్టుకొని దేశంలో కొనసాగుతున్న ప్రజాస్వామ్య వ్యతిరేక పరిపాలనకు అనుకూలమైనటువంటి చట్టాలను సిద్ధపరచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రధానంగా దేశంలో నెలకొల్పబడుతున్న అశాంతి భద్రతలను గమనిస్తున్నప్పుడు అసలుకైతే దేశంలో ప్రజాస్వామ్య పాలనకు విలువ ఉందా అంటూ సూటిగా నిలదీశారు. దేశవ్యాప్తంగా చట్టాలకు న్యాయస్థానాలకు వ్యతిరేకంగా పనిచేసే వ్యక్తులు కరుడుగట్టిన నేరస్తులు ఘోరమైన క్రిమినల్స్ మహిళలను మానభంగాలు చేసే వ్యక్తులు ప్రజలను కిరాతకంగా చంపే నరహంతకులు న్యాయస్థానాలను చట్టాలను ఆసరాగా చేసుకుంటూ ప్రభుత్వాల అనుమతులతో ప్రభుత్వాల రక్షణతో ప్రజాస్వామ్యాన్ని శాసిస్తూ జాతీయ రాజకీయ ఎన్నికల్లో నేరుగా పోటీ చేసే అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని మండిపడ్డారు. వీటన్నిటికీ బదులు ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను గాలికి వదిలేసి దేశంలో అసాంఘిక శక్తులను పెంచి పోషిస్తూ వాళ్లందరినీ కేంద్ర ప్రభుత్వ రాజకీయ పాలనలో భాగస్తులను చేస్తూ ప్రజాస్వామ్యాన్ని రక్షించండి అంటూ దేశ ప్రజలకు పిలుపునివ్వడం నిస్సిగ్గు కరంగా ఉందన్నారు.

పనికిరాని పాదయాత్రలు..

దేశ ప్రధాని మోడీ భారతదేశాన్ని పాలిస్తున్న తీరు అప్రజాస్వామికమని తెలిసినప్పటికీ మోడీ పాలన ఆగడాలను నియంత్రించడంలో కేంద్ర మంత్రులు పూర్తిగా విఫలమైనారని సూటిగా నిలదీశారు. మరోవైపు జాతీయ ఎన్నికల కమిషన్ దేశంలో చేస్తున్న ఆగడాలు సుప్రీంకోర్టు లాంటి న్యాయస్థానాలకే అంతుచిక్కడం లేదని మండిపడ్డారు. అప్రజస్వామికమైన విధానాలను ప్రజాస్వామ్య విధానంలో పాలించడం కోసం పార్లమెంటులో చట్టాలను ఏర్పాటు చేసుకున్న జాతీయ ఎన్నికల కమిషన్ బిజెపి ప్రభుత్వానికి వాటిని అనుకూలంగా మార్చుకొని చట్ట సవరణ చేసి న్యాయస్థానాలలో రూపొందించబడిన చట్టాలను వ్యతిరేకిస్తూ భారత రాజ్యాంగం విధించిన పరిపాలనా పరిధిలను ధిక్కరిస్తూ దేశాన్ని మోసగించే పాలనను చట్ట సవరణ చేసుకొని దానిని అమలుపరచుకొని అత్యంత దారుణంగా ముందుకు పోతున్నారని మందలించారు. మొన్నటికి మొన్న దేశ హోం శాఖ మంత్రి అమిత్ షా హైదరాబాదులో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజాస్వామ్యాన్ని రక్షించండి అంటూ దేశ ప్రజలకు ఇచ్చిన సంకేతం వినడానికి విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. దేశాన్ని పాలిస్తున్న బిజెపి నడిరోడ్లపై ధర్నాలు చేస్తూ వాళ్ళ ప్రభుత్వం పై వాళ్లే తిరుగుబాటు ర్యాలీలు నిర్వహించడం ప్రపంచ దేశాల్లో ఎక్కడైనా చూడగలమా అంటూ గుర్తు చేశారు. మరోవైపు దేశాన్ని పాలిస్తున్న బిజెపి ప్రతిపక్షాలపై పోరాటం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యంపై తిరుగులేని దాడులు జరుగుతున్నందునే దేశంలోని మేధావులు దేశంలోని విద్యార్థులు దేశంలోని ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునే పనిలో నిమగ్నమైపోయి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడులను తట్టుకొని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునే పనిలో కేంద్ర ప్రభుత్వ మొద్దుబారిన పాలనను తట్టుకొని నిలబడగలుగుతున్నారని అభినందించారు. అదే సందర్భంలో వాళ్లకు జవాబుదారీతనాన్ని కనపర్చాల్సిన కేంద్ర ప్రభుత్వం వాళ్లు కూడా రోడ్లపైకి వచ్చి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని ర్యాలీలు నిర్వహించడం దేనికి సూచననో కేంద్ర ప్రభుత్వ హోం శాఖ మంత్రి అమిత్ షా బహిరంగంగా తెలియజేయలని డిమాండ్ చేశారు. భారీ బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ సర్ ప్రక్రియ విధానంపై సుదీర్ఘంగా చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉందంటూ దేశ ప్రజలకు సందేశాన్ని ఇస్తూనే శీతాకాలపు పార్లమెంటు సభల్లో సర్ ప్రక్రియ విధానం పై చర్చించడానికి పార్లమెంటులో ఎలాంటి అవకాశం లేదంటూ మొండిగా వాదించడం అబద్దాలకు ఆదర్శ పురుషుడి వ్యాఖ్యానాలను దేశ ప్రజలకు అనువదింప చేసే విధంగా ఉందని ఎద్దేవ చేశారు. మొత్తం మీదుగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ దేశాన్ని దేశ ప్రజలను అవమానపరచడం ఇకనైనా మానుకోవాలని హెచ్చరించారు.

తిరుమలాయపల్లిలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పర్యటన





ఆపదలో బాధిత కుటుంబాలకు పరామర్శ..
అంతర్జాతీయ వైద్య పరిశోధనలో ప్రతిభ చాటిన
యువకుడికి ఘన గౌరవం

రాయపర్తి(జై భీమ్ న్యూస్)

తిరుమలాయపల్లి ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు భరోసా కల్పించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో వైద్య పరిశోధనలో ప్రతిభ చాటిన యువకుడిని ప్రోత్సహిస్తూ పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి తిరుమలాయపల్లి గ్రామంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ముద్రబోయిన ముత్తయ్య కుటుంబానికి పరామర్శ

మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముద్రబోయిన వెంకటేశ్వర్లు గారి చిన్నాన్న, తిరుమలాయపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు స్వర్గీయ ముద్రబోయిన ముత్తయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యాన్ని కల్పించారు.

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వీరభద్రయ్య కుటుంబానికి భరోసా

తిరుమలాయపల్లి ప్రభుత్వ పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహించిన ముద్రబోయిన వీరభద్రయ్య ఇంటి వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన నివాసానికి వెళ్లి భార్యాపిల్లలను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని కల్పించారు.

అంతర్జాతీయ వైద్య పరిశోధనలో గ్రామ యువకుడికి గుర్తింపు

తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన వశపాక అనిల్ అంతర్జాతీయ వైద్య పరిశోధనా వేదికపై యువ పరిశోధకుడిగా అవార్డు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అనిల్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, ఆయన పరిశోధనా ప్రతిభను ప్రత్యేకంగా అభినందించారు. ఒకవైపు కష్టాల్లో ఉన్న కుటుంబాలను పరామర్శిస్తూ, మరోవైపు గ్రామానికి పేరు ప్రతిష్ఠలు తీసుకొస్తున్న యువ ప్రతిభను గుర్తించి గౌరవించడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతూ, యువత విజయాలను ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గ్రామ ప్రజలకు అండగా నిలిచారు.

కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్యా నాయక్, మండల ఉపాధ్యక్షుడు గిరగాని రాజు, మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు బొమ్మర కళ్యాణ్ గౌడ్, పెండ్లి మహేందర్ రెడ్డి, ఉలెంగాల నరసయ్య, రాయిని యాకన్న, గిరగాని వేణు, మండల ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, గ్రామ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి అసలు చరిత్ర ఇదేనా?

తరతరాలుగా చెబుతున్న కథల వెనుక ప్రశ్నలు..
బౌద్ధ సంప్రదాయాల నుంచి పురాణాల వరకు!
డాక్టర్ బరిగెల శివ



ప్రత్యేక కథనం(జై భీమ్ డెస్క్)

వేలాది సంవత్సరాల భారతీయ చరిత్ర.. అనేక మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు.. తరతరాలుగా కొనసాగుతున్న పండుగలు! ప్రతి పండుగ వెనుక ఒక కథ ఉంటుంది. కానీ ఆ కథే చరిత్రనా? తరతరాలుగా మనం వింటున్న కథనాలకు చారిత్రక ఆధారాలు ఏమిటి? భారతదేశంలో కోట్లాది మంది జరుపుకునే దీపావళి పండుగపై ఇలాంటి ప్రశ్నలు ఇప్పుడు మరోసారి చర్చకు వస్తున్నాయి. దీపావళి అంటే దీపాల పండుగ. చీకటిపై వెలుగు విజయం, చెడుపై మంచి విజయం అనే భావనతో ఈ పండుగను జరుపుకుంటారు. అయితే దీపావళి మూలాల గురించి భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో భిన్నమైన కథనాలు ఉండటం గమనార్హం.

రాముడి కథ నుంచి నరకాసుర వధ వరకు..

ఉత్తర భారతదేశంలో రాముడు 14 సంవత్సరాల వనవాసం అనంతరం రావణుడిని సంహరించి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా దీపావళి జరుపుకుంటారని విశ్వసిస్తారు. దక్షిణ భారతదేశంలో శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించిన సందర్భంతో దీపావళిని అనుసంధానిస్తారు. జైన సంప్రదాయంలో మహావీరుడి నిర్వాణ దినంగా దీపావళికి ప్రాధాన్యత ఉంది. సిక్కు సంప్రదాయంలో గురు హర్‌గోబింద్ జైలు నుంచి విడుదలైన సందర్భంగా బందీ ఛోర్ దివస్ జరుపుకుంటారు. ఒకే పండుగకు వివిధ ప్రాంతాల్లో భిన్నమైన కథలు, సంప్రదాయాలు ఉండటం దీపావళి చరిత్రను మరింత ఆసక్తికరంగా మారుస్తోంది.

బౌద్ధ దీపదాన సంప్రదాయాలు.. చర్చకు వస్తున్న మరో కోణం!

భారతదేశ చరిత్రలో బౌద్ధమతం కీలకమైన పాత్ర పోషించింది. అశోక చక్రవర్తి కాలంలో బౌద్ధమతం విస్తృతంగా వ్యాపించింది. బౌద్ధ సంప్రదాయాల్లో దీపదానం, దీపాలు వెలిగించడం వంటి ఆచారాలకు ప్రాధాన్యత ఉంది. దీపావళికి బౌద్ధ దీపదాన సంప్రదాయాలతో సంబంధం ఉందని కొందరు రచయితలు, అంబేద్కర్‌వాద వర్గాలు ప్రత్యామ్నాయ చారిత్రక వాదనలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై 'ది ప్రింట్' వంటి ప్రచురణల్లో కూడా చర్చ జరిగింది. అయితే దీపావళి పూర్తిగా బౌద్ధ పండుగ నుంచి ఉద్భవించిందని నిర్ధారించే బలమైన చారిత్రక ఆధారాలు లేవు. బౌద్ధ దీపదాన సంప్రదాయాలు, దీపావళి ఆచారాల మధ్య సంబంధాన్ని మరింత పరిశోధనతో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

చరిత్రను ఎవరు రాశారు? ఎవరి కథలు ప్రాధాన్యత పొందాయి?

భారతదేశ చరిత్రలో అనేక సామాజిక వర్గాలు, మతాలు, సంస్కృతులు తమదైన పాత్ర పోషించాయి. అయినప్పటికీ చరిత్రను అర్థం చేసుకునే విధానంపై నిరంతరం చర్చలు జరుగుతున్నాయి. దళిత–బహుజన చరిత్ర, బౌద్ధ చరిత్ర, సామాజిక ఉద్యమాల చరిత్రను కూడా సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని అంబేద్కర్‌వాదులు అభిప్రాయపడుతున్నారు. చరిత్రను ప్రశ్నించడం అంటే విశ్వాసాలను అవమానించడం కాదు. విశ్వాసాలను గౌరవిస్తూనే చారిత్రక ఆధారాలను పరిశీలించడం శాస్త్రీయ ఆలోచనలో భాగం.

అంబేద్కర్ చూపిన మార్గం.. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత సమాజంలో కులవివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారు. విద్య, స్వేచ్ఛ, సమానత్వం, మానవ గౌరవానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. 1956 అక్టోబర్ 14న బౌద్ధమతాన్ని స్వీకరించడం ద్వారా సామాజిక విముక్తికి కొత్త దిశను చూపించారు. అంబేద్కర్‌వాద దృక్కోణంలో ప్రతి సంప్రదాయాన్ని ప్రశ్నించడం, చరిత్రను అధ్యయనం చేయడం, ఆధారాల ఆధారంగా వాస్తవాలను తెలుసుకోవడం సమాజ చైతన్యానికి అవసరం. అయితే అంబేద్కర్ దీపావళిని బౌద్ధ పండుగగా ప్రకటించారని చెప్పడానికి ప్రత్యక్ష ఆధారాలు లేవు. ఆయన పేరుతో ప్రచారంలో ఉన్న కథనాలను కూడా ఆధారాలతో పరిశీలించాలి.

దీపావళి.. వెలుగుల పండుగ మాత్రమేనా, చరిత్రను తెలుసుకునే సందర్భమా?

దీపావళి పండుగను జరుపుకునే ప్రజలకు వారి విశ్వాసాలు, సంప్రదాయాలు ముఖ్యమైనవి. అదే సమయంలో పండుగల చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకోవడం కూడా అవసరం. పురాణ కథలు, మత విశ్వాసాలు, చారిత్రక ఆధారాలు.. ఈ మూడింటినీ వేర్వేరుగా పరిశీలించినప్పుడే సమగ్ర అవగాహన ఏర్పడుతుంది. దీపావళి చరిత్రపై తుది నిర్ణయం చెప్పడానికి మరింత పరిశోధన అవసరం. కానీ చరిత్రను తెలుసుకోవాలనే ప్రశ్నను ఆపలేం. వెలుగులు వెలిగించే పండుగ సందర్భంగా మన సమాజంలో అజ్ఞానం, అసమానత, కులవివక్ష అనే చీకట్లు తొలగి.. విద్య, విజ్ఞానం, సమానత్వం, మానవత్వం వెలుగులు విరజిమ్మాలని ఆకాంక్షిద్దాం. విశ్వాసాలను గౌరవిద్దాం.. చరిత్రను పరిశీలిద్దాం.. నిజాలను ఆధారాలతో తెలుసుకుందాం!

తెలంగాణ,ఆంధ్ర ప్రదేశ్ ప్రజలందరికీ జై భీమ్ టీవీ తరపున నరకచతుర్దశి శుభాకాంక్షలు

హైదరాబాద్ నవంబర్ 7 -2026(జై భీమ్ న్యూస్)

నరక చతుర్దశిలి అనేది దీపావళి పండుగలో రెండవ రోజు. దీన్ని చోటి దీపావళి, కాళీ చౌదస్, రూప్ చౌదస్ అని కూడా పిలుస్తారు. 2026లో తేదీ కార్తీక మాసం కృష్ణ పక్ష చతుర్దశి తిథి నవంబర్ 7 ఉదయం 10:47 నుంచి నవంబర్ 8 ఉదయం 11:27 వరకు ఉంటుంది. ఉదయ తిథి ప్రకారం చాలా ప్రాంతాల్లో నవంబర్ 8, 2026 (ఆదివారం) నాడు నరక చతుర్దశిని జరుపుకుంటారు.

చారిత్రక / పౌరాణిక కథ

నరకాసురుడు (భూమిదేవి కుమారుడు) చాలా శక్తివంతుడైన రాక్షసుడు. అతను దేవతలను, మనుషులను హింసించి, 16,000 మంది స్త్రీలను బందీలుగా ఉంచాడు. అదితి దేవి చెవికుండలాలను కూడా దొంగిలించాడు. దేవతల ప్రార్థనల మేరకు శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి నరకాసురుడిపై యుద్ధం చేశాడు. నరకాసురుడికి "తన తల్లి చేతిలోనే మరణం" అనే వరం ఉండటంతో, భూమిదేవి అవతారమైన సత్యభామ కృష్ణుని సహాయంతో అతన్ని సంహరించింది. మరణ సమయంలో నరకాసురుడు "నా మరణ దినాన్ని దుఃఖంతో కాకుండా సంతోషంతో, దీపాలతో జరుపుకోవాలి" అని వరం కోరాడు. అందుకే ఈ రోజును నరక చతుర్దశిగా జరుపుకుంటారు. ఇది చెడుపై మంచి విజయానికి, చీకటిపై వెలుగు విజయానికి చిహ్నం.

ప్రాముఖ్యత

– చెడు శక్తులు, నెగటివిటీ, బద్ధకం నుంచి విముక్తి.
– అకాల మరణ భయం నుంచి రక్షణ.
– శారీరక, మానసిక శుద్ధి.
– యమధర్మరాజు అనుగ్రహం కోసం ప్రార్థన.

ముఖ్య ఆచారాలు

1. అభ్యంగ స్నానం (అత్యంత ముఖ్యమైనది)

సూర్యోదయానికి ముందే నిద్రలేచి నువ్వుల నూనె (లేదా సెసమీ ఆయిల్) ఒంటికి రాసుకుని, ఉబ్బన్/నలుగు పెట్టుకుని స్నానం చేయాలి. ఇది శరీర శుద్ధికి, పాపాలు తొలగడానికి సంకేతం.

2. యమ దీపదానం

సాయంత్రం యమధర్మరాజు కోసం దక్షిణ దిశగా దీపం వెలిగించాలి. ఇంటి ముంగిట, గుమ్మాల వద్ద కూడా దీపాలు వెలిగిస్తారు.

3. పూజ

– శ్రీకృష్ణుడు + సత్యభామ
– కొన్ని ప్రాంతాల్లో హనుమంతుడు, కాళీమాత, లక్ష్మీదేవి
– నువ్వుల నూనెతో దీపారాధన చేయడం మంచిది.

4. ఇతర ఆచారాలు

– ఇల్లు శుభ్రం చేసి, కొత్త బట్టలు ధరించడం
– రంగోలీలు వేయడం
– కొన్ని ప్రాంతాల్లో టపాసులు కాల్చడం
– పిండివంటలు చేసి కుటుంబంతో కలిసి భోజనం చేయడం

సారాంశం

నరక చతుర్దశి అంటే కేవలం పండుగ కాదు. మనలో ఉన్న "నరక" (చెడు గుణాలు, అహంకారం, బద్ధకం)ను సంహరించి, కొత్త వెలుగుతో జీవితాన్ని ప్రారంభించాలనే సందేశం. దీపావళి మొత్తం ఉత్సవాలకు ఇది పునాది రోజు.

మీ ప్రాంతం ప్రకారం స్థానిక పంచాంగం చూసి అభ్యంగ స్నాన ముహూర్తం ఖచ్చితంగా తెలుసుకోండి.



- మీ మంచి కోరే మీ శ్రేయోభిలాషి తాళ్లపెల్లి సురేష్ జై భీమ్ టీవీ తెలంగాణ రిపోర్టర్.

ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లల్లోనూ వెలుగులు నింపాలి

కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పిలుపు

కరీంనగర్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినంతో పాటు దీపావళి పర్వదిన వేడుకలను ఆదివారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించాలని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను దీపావళి పండుగ సందర్భంగా ప్రతి మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు.మానకొండూరు నియోజకవర్గ పరిధిలోని మానకొండూరు, శంకరపట్నం, తిమ్మాపూర్, గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేడుకల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్ పాలకవర్గాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సమన్వయం చేసుకోవాలని డాక్టర్ కవ్వంపల్లి సూచించారు.

ప్రత్యేక విద్యార్థుల ప్రతిభకు వరంగల్ సీపీ ఎన్. శ్వేత ప్రోత్సాహం

స్వయంగా తయారుచేసిన వస్తువుల కొనుగోలు





హన్మకొండ, నవంబర్ 6 (జై భీమ్ న్యూస్)

ప్రత్యేక విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన ప్రత్యేక విద్యార్థులు తమ చేతులతో తయారుచేసిన వివిధ రకాల హ్యాండ్‌మేడ్ వస్తువుల విక్రయం కోసం హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌ను కేంద్ర వ్యవస్థాపకురాలు రామలీల, ఈసీ సభ్యుడు కల్యాణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత స్టాల్‌ను సందర్శించి, ప్రత్యేక విద్యార్థులు స్వయంగా తయారుచేసిన హ్యాండ్‌మేడ్ వస్తువులను కొనుగోలు చేశారు. విద్యార్థులు ఎంతో సృజనాత్మకతతో, నైపుణ్యంతో తయారుచేసిన వస్తువులను పరిశీలించి వారిని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రత్యేక విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, తమలోని ప్రతిభను సమాజానికి పరిచయం చేసుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యేక విద్యార్థులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారికి తగిన అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లోనూ రాణించగలరని అన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక విద్యార్థులు స్వయంగా తయారుచేసిన వస్తువులను కొనుగోలు చేయడం, వారి ప్రతిభను అభినందించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, ఏఆర్ అదనపు డీసీపీ సురేష్, ఆర్ఐ (అడ్మిన్) సర్జన్ రాజ్, వెల్ఫేర్ ఆర్ఐ సతీష్, ఆర్ఐ శ్రీధర్, మల్లికాంబ మనోవికాస కేంద్రం సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం.. వ్యక్తి ప్రాణాలు కాపాడిన బ్లూకోల్ట్ పోలీసులు

సమయస్ఫూర్తితో స్పందించిన సిబ్బందికి నగదు రివార్డులు అందజేసిన వరంగల్ సీపీ ఎన్. శ్వేత



వరంగల్, నవంబర్ 7 (జై భీమ్ క్రైమ్ న్యూస్)

సమయస్ఫూర్తితో స్పందించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడిన బ్లూకోల్ట్ పోలీసు సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ అభినందించి నగదు రివార్డులు అందజేశారు. విధి నిర్వహణలో అప్రమత్తత, అంకితభావంతో వ్యవహరించి ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండ్ల సింగారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై శుక్రవారం సాయంత్రం కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. చాలా సమయం గడిచినా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన అతని భార్య డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే స్పందించిన కేయూ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సై శ్రావణి బ్లూకోల్ట్ సిబ్బంది వీరాస్వామి, తరుణ్ కుమార్‌లను అప్రమత్తం చేశారు. దీంతో బ్లూకోల్ట్ సిబ్బంది సదరు వ్యక్తి మొబైల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా చింతగట్టు గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకుని రైల్వే ట్రాక్‌పై నిలబడి ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని గుర్తించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా చాకచక్యంగా వ్యవహరించి అతడిని సురక్షితంగా రక్షించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. అనంతరం అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో వారు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఘటనలో సమయస్ఫూర్తితో స్పందించి విలువైన ప్రాణాన్ని కాపాడిన బ్లూకోల్ట్ సిబ్బంది వీరాస్వామి, తరుణ్ కుమార్‌లను పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అభినందించి నగదు రివార్డులు అందజేశారు. ప్రజల ప్రాణాలు, భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విధి నిర్వహణలో అంకితభావంతో, బాధ్యతాయుతంగా పనిచేసే పోలీసు సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని ఈ సందర్భంగా సీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అదనపు డీసీపీ (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, కేయూ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు రూ.2.50 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన మాజీ మంత్రి కొండా సురేఖ

వరంగల్, 7 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)


శివనగర్ 35వ డివిజన్‌కు చెందిన నారాయణగిరి శ్రీవాణి అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కొండా సురేఖ వెంటనే స్పందించారు. బాధిత మహిళ చికిత్సకు ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 2.50 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరు చేయించారు.స్థానిక నగర కాంగ్రెస్ నాయకుడు శ్రీరాం రాజేష్ ఈ విషయాన్ని మాజీ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లగా, ఆమె తక్షణమే స్పందించి సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు శనివారం బాధిత మహిళ భర్త నారాయణగిరి రత్నాకర్‌కు రూ. 2.50 లక్షల విలువైన ఎల్ఓసీని కొండా సురేఖ అందజేశారు.ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందిన ఆర్థిక సహాయం బాధిత కుటుంబానికి చికిత్స ఖర్చుల



విషయంలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని అవసరమైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్ రాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, నగర కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేష్, పగడాల సతీష్, జన్ను శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం, ఆలోచనా శక్తి పెంపొందుతాయి

డిజిటల్ యుగంలోనూ పుస్తకాలకు తగ్గని ప్రాధాన్యత..
విద్యార్థులు, యువత పఠనాన్ని అలవాటు చేసుకోవాలి



హనుమకొండ, 7 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

జాతీయ పుస్తక వారోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండలోని అశోక కాంప్లెక్స్‌లో నవచేతన బుక్ హౌస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తకం మనిషికి మంచి నేస్తమని, జీవితాంతం జ్ఞానాన్ని అందించే గొప్ప సంపద అని పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెంపొందడంతో పాటు సమాజంపై అవగాహన, జీవితాన్ని చూసే దృక్పథం మెరుగుపడతాయని అన్నారు.డిజిటల్ యుగంలో సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల ప్రభావం పెరుగుతున్నప్పటికీ పుస్తక పఠనానికి ఉన్న ప్రాధాన్యత తగ్గలేదని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు. పుస్తకాలు సమాచారాన్ని అందించడమే కాకుండా నైతిక విలువలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని వివరించారు.తల్లిదండ్రులు చిన్ననాటి నుంచే పిల్లలకు పుస్తకాలు చదివే అలవాటు నేర్పించాలని, ప్రతి ఒక్కరూ పఠనాన్ని జీవితంలో భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. పుస్తక ప్రదర్శనలు పాఠకుల్లో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు రచయితలు, సాహితీవేత్తలు, పాఠకులకు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా నవచేతన బుక్ హౌస్ నిర్వాహకులను అభినందించారు.అనంతరం ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను సందర్శించిన ఎంపీ పలు రకాల పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించి, నచ్చిన పుస్తకాలను స్వయంగా కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, గడ్డం రాజిరెడ్డి, వల్లాల వెంకటరమణ, వేణుమాధవ్, తోట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమ్మెకు పీడీఎస్‌యూ సంపూర్ణ మద్దతు

న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి
పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్





హనుమకొండ, 7 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ వద్ద కొనసాగుతున్న సమ్మెలో పాల్గొని ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న 17,541 మంది ఒప్పంద ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 13 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, తల్లీబిడ్డల సంరక్షణ, టీకాల కార్యక్రమాలు, వ్యాధుల నియంత్రణ వంటి అనేక ముఖ్యమైన సేవల్లో ఉద్యోగులు నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకుండా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల క్రమబద్ధీకరణ, పూర్తి స్థాయి వేతనం, వార్షిక వేతన పెంపు, విధేయత బోనస్, వేతన సవరణ సంఘం ప్రయోజనాలు, ప్రసూతి సెలవులు, ఆరోగ్య బీమా వంటి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పోరాటానికి పీడీఎస్‌యూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ప్రణయ్, ఆదిత్య, దోబీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రత్యేక చర్యలు

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించాలి
కళాశాలల్లో ఫేస్ రికగ్నిషన్ హాజరు అమలు చేయాలి..
కలెక్టర్ డాక్టర్ సత్య శారద





వరంగల్, 7 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్యలో ప్రవేశాలకు అవసరమైన మార్గదర్శకత్వం కల్పించాలని సూచించారు.శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జిల్లా కాలేజియేట్ విద్యా అభివృద్ధి, సమీక్ష కమిటీ సమావేశంలో కలెక్టర్ పాల్గొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యా ప్రగతి, విద్యార్థుల ప్రవేశాలు, పరీక్ష ఫలితాలు, మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా నైపుణ్యాభివృద్ధి కోర్సులు, పోటీ పరీక్షలకు శిక్షణ, ఉన్నత విద్యపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్వల్పకాలిక కార్యక్రమాలతో పాటు క్యాంపస్ ప్లేస్‌మెంట్లను ప్రోత్సహించాలని తెలిపారు.జిగ్నాసా విద్యార్థి పరిశోధన ప్రాజెక్టులు, ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ, ఎన్పీటీఈఎల్, స్వయం వంటి కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. కళాశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రయోగశాలలు, బాలికల వసతి గృహాలు, తాగునీరు, మరుగుదొడ్లు, భవనాల మరమ్మతులకు సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రిన్సిపల్స్‌ను ఆదేశించారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు విధానం అమలు తీరుతో పాటు అక్టోబర్ నెల హాజరు వివరాలను సమీక్షించారు.వరంగల్ సీకేఎం, వర్ధన్నపేట, రంగసాయిపేట, నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు ప్రత్యేక అధికారులను నియమించి యాజమాన్య నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కళాశాలల వారీగా సమస్యలను గుర్తించి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జిల్లా కాలేజియేట్ విద్యా అభివృద్ధి కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ మల్లం నవీన్, కమిటీ సభ్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆదోని పరిషత్ పోరులో సైకిల్ ప్రభంజనం

ఆదోని : ఆదోని పరిషత్ పోరులో సైకిల్ స్పీడు పెంచి 20 ఎంపీటీసీలు , వైసిపీ 10 ఎంపిటిసిలు , బిజెపి 1,ఎంపిటిసి,స్థానాలను కైవసం చేసుకుంది. శనివారం స్థానిక ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా పోలీస్ అధికారుల ఆధ్వర్యములో పెద్దయత్తున పరిషత్ ఓట్ల లెక్కింపు ఏర్పాటు చేసారు. ఓట్ల లెక్కింపును ఉదయం ప్రారంభించారు. సాయంత్రం అధికారులు లెక్కించిన పిదప తెలిపిన విజేతల వివరాలు ఆదోని 1,మండలం లో 14 ఎంపిటిసిలకు గాను టీడీపీ 8, వైసిపీ 6, గెలుపొందగా, ఆదోని 2 మండలం 17 ఎంపిటిసిలకు టిడిపి 12, వైసిపీ 4, బిజెపి 1 గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. అదేవిదంగా జడ్పీటీసీల ఓట్ల లెక్కింపు జరుగుతున్నాయి.స్థానిక రెవెన్యూ అధికారులు,పోలీస్ అధికారులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేస్తూ ఎక్కడ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండాఅధికారులు పర్యవేక్షిస్తున్నారు.

రూ.3 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన

44, 45, 64వ డివిజన్లలో రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలు.. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





వరంగల్, 7 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

గ్రేటర్ వరంగల్ నగరంలోని 44, 45, 64వ డివిజన్లలో రూ.3 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకన్నతో కలిసి శంకుస్థాపన చేశారు.కడిపికొండలోని రాజీవ్ గృహకల్ప ప్రాంతంతో పాటు 44వ డివిజన్ పరిధిలోని సింగారం, కొత్తపల్లి గ్రామాలు, 64వ డివిజన్‌లోని ఇంటీరియల్ కాలనీలో ఈ పనులు చేపట్టనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్

కొడంగల్ ఎత్తిపోతలలో భారీ అవకతవకలు జరిగాయన్న కేటీఆర్
రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని విమర్శ
ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అంటూ తీవ్ర విమర్శ

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. “క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి” అని అన్నారు. ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

డెంగ్యూ బాధిత చిన్నారి అలీజా ఖాద్రికి పరామర్శ

ఎంజీఎం ఆసుపత్రిలో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ప్రొఫెసర్ సారంగపాణి, సదాలక్ష్మి



వరంగల్ , 7 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

డెంగ్యూ జ్వరంతో వరంగల్‌లోని ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి కుమార్తె సయ్యదా అలీజా ఖాద్రిని కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం విశ్రాంత ప్రొఫెసర్, మాజీ డీన్ సారంగపాణి, ఆయన సతీమణి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సదాలక్ష్మి పరామర్శించారు. ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డును సందర్శించి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య చికిత్స వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అలీజా త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకొని తిరిగి పాఠశాలకు వెళ్లాలని ఆకాంక్షించారు. కష్ట సమయంలో ఖాద్రి కుటుంబానికి ధైర్యం చెబుతూ తమ సంఘీభావం, మద్దతు తెలిపారు. తన కుమార్తెను పరామర్శించి, సారంగపాణి, సదాలక్ష్మికి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ప్రొఫెసర్ ఖాద్రి కృతజ్ఞతలు తెలిపారు.

యువ పార్లమెంట్ పోటీల్లో ముగ్గురు విద్యార్థుల ఎంపిక

ఒకే దేశం - ఒకే ఎన్నికలపై విద్యార్థుల ప్రసంగాలు.. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత





కేయూ క్యాంపస్, 7 నవంబర్ 2026 జై భీమ్ న్యూస్

కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో మై భారత్ సహకారంతో నిర్వహించిన వికసిత్ భారత్ యువ పార్లమెంట్--2026 జిల్లా స్థాయి పోటీల్లో ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్ 6న నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా నుంచి 102 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 54 మంది పాల్గొన్నారు. ‘ఒకే దేశం -- ఒకే ఎన్నికలు’ అంశంపై విద్యార్థులు ఎన్నికల ప్రయోజనాలు, సవాళ్లు, ప్రజాస్వామ్యంపై ప్రభావం వంటి అంశాలను వివరిస్తూ తమ వక్తృత్వ ప్రతిభను చాటుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం మాట్లాడుతూ యువతలో జాతీయ భావన, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. జ్యూరీ సభ్యులుగా వ్యవహరించిన ఎం. పరశురాములు, డాక్టర్ ఎం. అంజయ్య, డాక్టర్ ఎం. ఆజం అలీ, డాక్టర్ ఎ. మధు, డాక్టర్ పి. తిరుపతి ప్రతిభ ఆధారంగా ఆర్. అక్షయ, జె. అక్షయ, డి. సౌమ్యలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రొఫెసర్ ఈ. నారాయణ, జిల్లా యువజన అధికారి భూక్య సంజీవ్, కన్వీనర్లు, అధ్యాపకులు, ఇతర అధికారులు పాల్గొని విజేతలను అభినందించారు.

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువతదే కీలక పాత్ర!

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్.. యువత నూతన ఆవిష్కరణలతో ముందుకు సాగాలి
మార్తినేని ధర్మారావు



హనుమకొండ (జై భీమ్ న్యూస్):

2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయమైన ‘వికసిత్ భారత్ ఏ 2047’ సాధనకు యువత భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు.హనుమకొండలోని తాళ్ల పద్మావతి కళాశాలలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పున్నం వేణు ఆధ్వర్యంలో నిర్వహించిన ‘యువ సంవాద్ -- వికసిత్ భారత్ ఏ 2047’ కార్యక్రమానికి మార్తినేని ధర్మారావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, స్టార్టప్‌లు, సామాజిక సేవ వంటి రంగాల్లో తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. దేశ అభివృద్ధిలో ప్రతి యువకుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, బాధ్యతాయుతమైన ఆలోచనలు, నూతన ఆవిష్కరణలు, నిరంతర కృషితో ముందుకు సాగినప్పుడే వికసిత్ భారత్ లక్ష్యం సాకారమవుతుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో 62వ డివిజన్ అధ్యక్షుడు మేకల శ్రావణ్ యాదవ్, ఇన్‌చార్జి నిఖిల్ రావు, బీజేవైఎం ఉపాధ్యక్షులు మద్దెల కార్తీక్, నల్లరపు శివ, కార్యదర్శులు భరత్, శశి, ఉదయ్, ప్రవీణ్, సీనియర్ నాయకులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత్‌ఫైండర్ పాఠశాలలో ఘనంగా దీపావళి వేడుకలు



ఐనవోలు : (జై భీమ్ న్యూస్)

మండల కేంద్రంలో పాత్‌ఫైండర్ హైస్కూల్‌లో దీపావళి పండుగ వేడుకలను శనివారం ఘనంగా ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. దీపావళి పండుగ విశిష్టతను, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తూ ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించే పండుగ మాత్రమే కాకుండా, చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీక అని తెలియజేశారు. శ్రీరాముడు రావణాసురుడిపై విజయం సాధించి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికిన విషయాన్ని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు దీపావళి పండుగకు సంబంధించిన పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు వివిధ కళారూపాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు స్వయంగా తయారుచేసిన దీపాలు, రంగురంగుల అలంకరణలు, పండుగకు సంబంధించిన చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. సుభానుద్దీన్ మాట్లాడుతూ, పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేదికలని అన్నారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, శబ్ద కాలుష్యం మరియు వాయు కాలుష్యానికి కారణమయ్యే బాణసంచాకు దూరంగా ఉండాలని సూచించారు. దీపాలు వెలిగిస్తూ, కుటుంబ సభ్యులతో ఆనందంగా, సురక్షితంగా దీపావళి జరుపుకోవాలని ఆకాంక్షించారు.పాఠశాల డైరెక్టర్ ఉ చైర్మన్ డా. ఎల్.ఎన్. వెంకటేశ్వర్ రావు విద్యార్థులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి ఒక్కరి జీవితాల్లో విద్య అనే వెలుగు నిండాలని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో పాఠశాల డైరెక్టర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.వెలుగుల పండుగ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం మరియు విజయాలను నింపాలని పాత్‌ఫైండర్ హైస్కూల్ యాజమాన్యం ఆకాంక్షించింది.

దివ్యాంగులు, అనాథ పిల్లల మధ్య దీపావళి సంబరాలు

పండుగ అంటే పదిమందికి ఆనందాన్ని పంచడమే - డాక్టర్ అనితా రెడ్డి



హనుమకొండ, నవంబర్ 7 (జై భీమ్ న్యూస్)

పండుగ అంటే మనం మాత్రమే సంతోషంగా ఉండటం కాదని, పదిమందికి ఆనందాన్ని పంచడమే నిజమైన పండుగ అని కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమం, స్వధార్ ఆశ్రమం, అనాథ పిల్లల ఆశ్రమాలను సందర్శించి చిన్నారులతో కలిసి దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు వివిధ రకాల టపాసులు, మిఠాయిలు అందించి వారితో కలిసి టపాసులు కాల్చి పండుగ సంబరాలను జరుపుకున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ పిల్లల ముఖాల్లో కనిపించిన ఆనందం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. పండుగల అసలైన ఆనందం ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపడంలోనే ఉందన్నారు. అజ్ఞానాన్ని తొలగించి ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపే సందేశాన్ని దీపావళి అందిస్తుందని పేర్కొన్నారు. లక్ష్మీదేవి ఆశీస్సులతో ప్రతి ఇంటా సిరిసంపదలు, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుచరిత, వసుధ, హరిత, శైలజ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

శనిగరం నుంచి జాతీయస్థాయికి.. షూటింగ్‌లో బంగారు గురి పెట్టిన తాన్సిస్!

70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అద్భుత ప్రతిభ
10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ప్రథమ స్థానం..
డిసెంబర్‌లో గోవాలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత





కమలాపూర్, నవంబర్ 7 (జై భీమ్ న్యూస్)

క్రీడారంగంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు సైతం తమ ప్రతిభతో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందుతూ జాతీయస్థాయి పోటీలకు ఎంపికవుతున్న నేపథ్యంలో హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన విద్యార్థిని సంగం తాన్సిస్ అరుదైన విజయాన్ని సొంతం చేసుకుంది. రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకోవడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు ఎంపికై గ్రామానికి, మండలానికి గర్వకారణంగా నిలిచింది. హైదరాబాద్‌లోని తెల్లాపూర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో తాన్సిస్ పాల్గొంది. అండర్-17 బాలికల విభాగంలో నిర్వహించిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో పోటీపడిన ఆమె తన అసాధారణ ఏకాగ్రత, గురి, పట్టుదలతో ప్రత్యర్థులను అధిగమించింది. పోటీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ప్రథమ స్థానాన్ని సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో తాన్సిస్ డిసెంబర్‌లో గోవాలో నిర్వహించనున్న జాతీయస్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికైంది. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభను చాటి జాతీయస్థాయికి అర్హత సాధించడం ఆమె క్రీడా ప్రయాణంలో మరో కీలక మైలురాయిగా నిలిచింది. షూటింగ్ వంటి క్రీడలో ఏకాగ్రత, క్రమశిక్షణ, నిరంతర సాధన ఎంతో అవసరం. వీటన్నింటినీ ప్రదర్శిస్తూ తాన్సిస్ సాధించిన విజయం పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో బంగారు పతకం సాధించడం పట్ల శనిగరం గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాన్సిస్ విజయంపై ఆమె తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు. చదువుతో పాటు క్రీడల పట్ల విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తే మరిన్ని విజయాలు సాధించే అవకాశాలు ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన తాన్సిస్ గోవాలో జరగనున్న పోటీల్లోనూ ఇదే పట్టుదల, ఏకాగ్రతతో రాణించి మరిన్ని పతకాలు సాధించాలని గ్రామస్థులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రానికి, కమలాపూర్ మండలానికి మరింత పేరు తీసుకురావాలని కోరుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభకు సంగం తాన్సిస్ సాధించిన విజయం నిదర్శనంగా నిలుస్తోంది.

46 టపాసుల దుకాణాలకు ఆర్డీవో అనుమతి

నంద్యాల : నంద్యాల పట్టణంలో టపాసుల విక్రయాల కోసం 46 దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్డీవో అనుమతులు మంజూరు చేశారని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు.ఆర్డీవో అనుమతులు పొందిన 46 దుకాణాల నిర్వాహకులు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ట్రేడ్ లైసెన్స్ ఫీజుతో పాటు వివిధ రకాల పన్నుల రూపంలో మొత్తం రూ.2,80,812 చెల్లించినట్లు కమిషనర్ పేర్కొన్నారు.ఈ దుకాణాల ద్వారా మున్సిపాలిటీకి గణనీయమైన ఆదాయం సమకూరిందని, పన్నుల రూపంలో వచ్చే ఆదాయం పట్టణ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ఆయన తెలిపారు. వ్యాపారులు సకాలంలో పన్నులు చెల్లిస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ బి. శేషన్న కోరారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా సామాన్యుడి ఆయుధంగా Jai Bheem TV

రాజమహేంద్రవరంలో ఆచార్య ఎన్జీ రంగా 126వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

రైతుల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ఆచార్య ఎన్జీ రంగా
అసోసియేట్ డీన్ డాక్టర్ కె.వి. రమణమూర్తి



రాజమహేంద్రవరం, నవంబర్ 7(జై భీమ్ న్యూస్)

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాలలో ఆచార్య ఎన్జీ రంగా 126వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. రైతుల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. జయంతి వేడుకల్లో భాగంగా విశ్వవిద్యాలయ విద్యార్థుల్లో స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, లక్ష్యసాధన పట్ల పట్టుదలను పెంపొందించే ఉద్దేశంతో 'కృషి మార్గదర్శి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల్లో వివిధ రంగాల్లో ఉన్నత విజయాలు సాధించిన వారి అనుభవాలు, విజయగాథలను ప్రస్తుత విద్యార్థులకు పరిచయం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రముఖ పూర్వ విద్యార్థి బొల్లినేని శీనయ్య విజయ ప్రస్థానాన్ని విశ్వవిద్యాలయ అధికారిక యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రసారం చేశారు. విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.వి. రమణమూర్తి మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా జయంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం తన జీవితాంతం కృషి చేసిన గొప్ప రైతు నాయకుడు ఆచార్య ఎన్జీ రంగా అని కొనియాడారు. అటువంటి మహనీయుని పేరును వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పెట్టడం ఆయనకు అందించిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. ఆయన పేరుతో కొనసాగుతున్న విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించడం ప్రతి విద్యార్థికి గర్వకారణమని తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా ఆశయాలు, రైతుల సంక్షేమం పట్ల ఆయన చూపిన నిబద్ధతను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. కష్టపడి చదివి, తమ ప్రతిభతో సమాజానికి, వ్యవసాయ రంగానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని ఆచార్య ఎన్జీ రంగా గురించి తమకు తెలిసిన విషయాలను ప్రస్తావించారు. ఆయన రైతుల కోసం చేసిన పోరాటాలు, వ్యవసాయ రంగానికి అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఆచార్య ఎన్జీ రంగా సేవలను స్మరించుకుంటూ జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై డీఎంహెచ్ఓ సమీక్ష



హన్మకొండ, నవంబర్ 7(జై భీమ్ న్యూస్)

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల సాధనలో హనుమకొండ జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య అధికారులకు సూచించారు. హనుమకొండ ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై ఆయన ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మాతా శిశు ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గర్భిణీలను ముందస్తుగా నమోదు చేయడం, హైరిస్క్ గర్భిణీలను గుర్తించి వారికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించడం, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చిన్నారులకు అందించే సాధారణ టీకాల వివరాలను యూ-విన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, అర్హత కలిగిన ఏ చిన్నారికి కూడా టీకాలు అందకుండా మిగిలిపోకూడదని స్పష్టం చేశారు. అదేవిధంగా అసంక్రమణ వ్యాధుల నివారణ కార్యక్రమం (ఎన్‌సీడీ), జాతీయ క్షయ నివారణ కార్యక్రమం (ఎన్‌టీఈపీ), హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణ కార్యక్రమాల అమలులో మరింత పురోగతి సాధించాలని తెలిపారు. ప్రజలకు విస్తృతంగా వైద్య పరీక్షలు నిర్వహించి అధిక రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులను ముందస్తుగా గుర్తించాలని సూచించారు. వ్యాధుల బారినపడిన వారికి నిరంతర వైద్య చికిత్స, క్రమం తప్పకుండా తదుపరి పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. క్షయ వ్యాధి అనుమానితులను ప్రాథమిక దశలోనే గుర్తించి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి క్రమం తప్పకుండా చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ప్రోగ్రామ్ అధికారి తమ పరిధిలోని కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని తెలిపారు. పనితీరులో వెనుకబడిన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి, లోపాలను వెంటనే సరిదిద్దుకోవాలని సూచించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి హనుమకొండ జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులు, వైద్య సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మదన్ మోహన్, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రజిత, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ మురళి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కోలా రాజేష్ కుమార్, వైద్యాధికారులు, సూపర్‌వైజర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశాలు, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు.. 20 లక్షల ప్రమాద బీమా!

ఆశా, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగ సంఘాలతో మంత్రి రాజనర్సింహ చర్చలు
బీమా సౌకర్యం కల్పించేందుకు అంగీకారం
27,130 మంది ఆశాలు, 18 వేలమంది ఎన్‌హెచ్‌ఎంలకు ప్రయోజనం
వచ్చే ఏడాది జనవరి నుంచి బీమా అమలుచేయాలని యోచన
ఆశాలకు వేతనం రూ.18 వేలకు పెంచాలి: ఆశా యూనియన్ అధ్యక్షురాలు మైముద

హనుమకొండ : (జై భీమ్ న్యూస్)

రాష్ట్రంలోని అక్రిడేటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్ (ఆశా వర్కర్స్)లు, జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులకు రూ.20 లక్షల ప్రమాద బీమా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే సహజ మరణాలకు సైతం రూ.2 లక్షల బీమా కల్పించాలని నిర్ణయించింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆ శాఖ ఉన్నతాధికారులతో శనివారం సమావేశమై ఈ అంశంపై చర్చించారు. ఆశా, ఎన్‌హెచ్‌ఎం సంఘాల ప్రతినిధులతో కూడా మంత్రి చర్చలు జరిపారు.తమకు ప్రమాద బీమా కల్పించాలని ఆశా వర్కర్లు చాలాకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ డిమాండ్‌తో పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. రాష్ట్రంలో 27,130 మంది ఆశా కార్యకర్తలున్నారు. ఎన్‌హెచ్‌ఎం కింద సుమారు 18 వేల మంది వివిధ క్యాడర్లలో పనిచేస్తున్నారు. శాశ్వత ఉద్యోగులు కాకపోవడంతో వీరికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే ఆరోగ్య బీమా, ఇతర సదుపాయాలు అందడం లేదు. విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదాలకు గురైతే వీరికి ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందటం లేదు. ప్రమాదాల్లో మరణిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని వారికి ముందుగా ప్రమాద బీమా కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం లీడ్ బ్యాంకులైన ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకుల ప్రతినిధులతో శుక్రవారం చర్చలు జరిపింది. ఎస్‌బీఐలో 18 వేలమంది ఆశాలకు పొదుపు ఖాతాలున్నాయి. యూబీఐలో 5 వేలున్నాయి. మిగతావి వేర్వేరు బ్యాంకుల్లో ఉన్నాయి. మొత్తం ఆశాలు, ఎన్‌హెచ్‌ఎంల వేతన ఖాతాలను ఈ రెండు బ్యాంకుల్లో ఏర్పాటుచేయనున్నారు. అందుకు ప్రతిగా వారికి ఆ రెండు బ్యాంకులు రూ.20 లక్షల ప్రమాద బీమా, రూ.2 లక్షల జనరల్ బీమా సౌకర్యాన్ని కల్పిస్తాయి. ఈ మేరకు బ్యాంకులు అంగీకరించాయని వైద్యశాఖ వర్గాలు తెలిపాయి.ప్రస్తుతం ఆశా కార్యకర్తలకు ప్రసూతి సెలవులు 120 రోజులే ఇస్తున్నారు. ఆ సెలవు కాలంలో వేతనం కూడా ఇవ్వటం లేదు. దీంతో వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని వారు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఆ డిమాండ్‌పై సర్కారు సానుకూలంగా స్పందించింది. 180 రోజులపాటు వేతనంతో కూడిన సెలవులు ఇచ్చేందుకు అంగీకరించింది. రెండు కాన్పుల వరకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని నిర్ణయించింది. అయితే, ఈహెచ్ఎ?స పరి?ధిలోకి తీసుకురావాలన్న ఆశా, ఎన్‌హెచ్ఎంల డిమాండ్‌పై ప్రభుత్వం ఎటువంటి హామీ ఇవ్వలేదని తెలిసింది. ఆశాలు, ఎన్‌హెచ్‌ఎం



ఉద్యోగులకు ప్రమాద బీమా సౌకర్యాన్ని వచ్చే ఏడాది జనవరి నుంచి వర్తింపజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలు జనవరిలోగా ఖరారు చేయనుంది. బీమాతోపాటు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులకు ఆర్థికశాఖ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అందుకు రెండుమూడు నెలల సమయం పడుతుందని వైద్యశాఖ వర్గాలు తెలిపాయి.ఆశాలకు ప్రమాద బీమా కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రసూతి సెలవులను పెంచడంతోపాటు ఆ కాలంలో వేతనం చెల్లించే విషయంలో కూడా సానుకూలంగా స్పందించింది. ఆశాలకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. ఆశాలలో 61 ఏళ్ల వయసు దాటినవారిని తొలగిస్తున్నారు. అలాంటివారు సుమారు 90 మంది ఉన్నారు. వీరి కుటుంబాల్లో అర్హులైన వారుంటే ఆశాలుగా అవకాశం కల్పించాలని సర్కారును కోరామని రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎం.డి. మైముద అన్నారు.

క్యాన్సర్ నివారణకు ఆరోగ్యకరమైన జీవనశైలి ఎంతో ముఖ్యం





ముందస్తు గుర్తింపు, సకాలంలో చికిత్సతో క్యాన్సర్‌ను ఎదుర్కోవచ్చు - వైద్య నిపుణులు

రాజమహేంద్రవరం, నవంబర్ 7(జై భీమ్ న్యూస్)

జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో శనివారం క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్సపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్. రాజు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యులు, అధ్యాపకులు, వైద్య విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యానికి పెను సవాలుగా మారుతోందని అన్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పొగాకు వినియోగం, మద్యపానం వంటి కారణాలు క్యాన్సర్ ముప్పును పెంచుతున్నాయని వివరించారు. క్యాన్సర్‌ను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు. ధూమపానం, పొగాకు ఉత్పత్తులు, మద్యపానానికి దూరంగా ఉండాలని, జంక్‌ఫుడ్, అధిక కొవ్వు, చక్కెర కలిగిన ఆహార పదార్థాల వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. పండ్లు, కూరగాయలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవడంతో పాటు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు. ముఖ్యంగా బాలికలకు వైద్యుల సలహా మేరకు తగిన వయస్సులో హెచ్‌పీవీ టీకా వేయించడం ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ స్పందన మాట్లాడుతూ క్యాన్సర్ నివారణ అనేది కేవలం వైద్యుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. క్యాన్సర్‌పై సమాజంలో ఉన్న అపోహలను తొలగించి, ప్రజల్లో సరైన అవగాహన కల్పించడం ద్వారా వ్యాధి భారాన్ని తగ్గించవచ్చని తెలిపారు. భవిష్యత్తులో క్యాన్సర్ కేసులు మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు నివారణ చర్యలకు ఇప్పటి నుంచే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సమీరా మాట్లాడుతూ స్త్రీలు, పురుషులు, పిల్లల్లో వచ్చే వివిధ రకాల క్యాన్సర్లు, వాటి ప్రారంభ లక్షణాలు, అందుబాటులో ఉన్న పరీక్షలు, వ్యాధి నిర్ధారణ పద్ధతుల గురించి వివరించారు. రొమ్ములో గడ్డలు, అసాధారణ రక్తస్రావం, నోటిలో మానని పుండ్లు, మింగడంలో ఇబ్బందులు, కారణం తెలియకుండా బరువు తగ్గడం, మలమూత్ర విసర్జనలో మార్పులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని, క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించి సకాలంలో చికిత్స పొందడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రొఫెసర్, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నోడల్ అధికారి డాక్టర్ బి. శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ క్యాన్సర్ కేసుల పెరుగుదలకు సంబంధించిన గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వైద్య విద్యార్థులు క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వైద్య విద్యార్థులు వైద్య సేవలకే పరిమితం కాకుండా సమాజంలో ఆరోగ్య అవగాహన కల్పించే బాధ్యతను కూడా స్వీకరించాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్త్రీలు, పురుషుల్లో వచ్చే క్యాన్సర్లలో కొన్ని ప్రత్యేకమైనవని, మరికొన్ని ఇరువురిలోనూ సంభవిస్తాయని వివరించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ, తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం కొంతవరకు తగ్గుతుందని తెలిపారు. మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లకు సంబంధించి వైద్యుల సూచనల మేరకు అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ నివారణకు పాటించాల్సిన ఆరోగ్య నియమాలను వైద్యులు వివరించారు. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు నడక లేదా ఇతర శారీరక వ్యాయామం చేయడం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పీచు పదార్థాలు అధికంగా ఉండే సమతుల ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన శరీర బరువును నిర్వహించుకోవడం ముఖ్యమని తెలిపారు. బాలికలకు, మహిళలకు వైద్యుల సలహా మేరకు హెచ్‌పీవీ టీకా వేయించడం, వయస్సు, ఆరోగ్య పరిస్థితి, ప్రమాద కారకాల ఆధారంగా రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్లకు సంబంధించి తగిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శరీరంలో అసాధారణ మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఎండలో ఎక్కువసేపు ఉండేవారు సూర్యరశ్మి నుంచి రక్షణ చర్యలు పాటించాలని, హెపటైటిస్ బీ టీకాతో పాటు వైద్యులు సూచించిన టీకాలు వేయించుకోవాలని వివరించారు. అదేవిధంగా వైద్య విద్యార్థులు గోడపత్రికల ద్వారా క్యాన్సర్‌కు దారితీసే అలవాట్లు, నివారించాల్సిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ, పాన్‌మసాలా వంటి పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, మద్యపానం చేయకూడదని సూచించారు. అధికంగా శుద్ధి చేసిన ఆహారం, జంక్‌ఫుడ్, అధిక చక్కెర కలిగిన పానీయాలను తరచుగా తీసుకోకూడదని తెలిపారు. శారీరక శ్రమ లేకుండా ఎక్కువసేపు కూర్చునే అలవాటును తగ్గించుకోవాలని, క్యాన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని పేర్కొన్నారు. వ్యాధి సోకుతుందనే భయంతో వైద్య పరీక్షలు, చికిత్సలను వాయిదా వేయకూడదని, శాస్త్రీయ ఆధారాలు లేని మందులు, ప్రత్యామ్నాయ చికిత్సల పేరుతో విలువైన సమయాన్ని వృథా చేసుకోకూడదని అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న అధ్యాపకులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులు, సిబ్బంది క్యాన్సర్ నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ దుర్గాప్రసాద్‌తో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, వైద్యులు, ఇంటర్న్‌లు, వైద్య విద్యార్థులు, పారామెడికల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి అభివృద్ధికి మరో ముందడుగు..

నూతన కోర్టు మంజూరుపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ఎల్కతుర్తికి నూతన కోర్టు మంజూరు.. 56 పోస్టులకు కేబినెట్ ఆమోదం

ఎల్కతుర్తి, నవంబర్ 7(జై భీమ్ న్యూస్)

ఎల్కతుర్తి మండల కేంద్రంలో నూతన కోర్టు ఏర్పాటు చేయడంతో పాటు, కోర్టు నిర్వహణకు అవసరమైన 56 పోస్టులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో మండల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా కృతజ్ఞతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్కతుర్తి మండల కేంద్రంలో నూతన కోర్టు ఏర్పాటు కావడం మండల ప్రజల చిరకాల స్వప్నమని పేర్కొన్నారు. కోర్టు మంజూరుతో పాటు దాని నిర్వహణకు అవసరమైన 56 పోస్టులకు కేబినెట్ ఆమోదం లభించడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఈ నిర్ణయంతో మండల ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువవుతాయని, న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని



తెలిపారు. ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా కావడంతో పాటు సత్వర న్యాయం పొందేందుకు అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎల్కతుర్తి మండల ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా నూతన కోర్టు మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రత్యేక చొరవ చూపిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మండల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నూతన కోర్టు ఏర్పాటు ఎల్కతుర్తి మండల అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని, సామాన్య ప్రజలకు న్యాయ సేవలు సులభంగా, వేగంగా అందుబాటులోకి రావడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజీ, ఎల్కతుర్తి సొసైటీ బ్యాంక్ చైర్మన్ ఎలిగేటి ఇంద్రసేన రెడ్డి, పీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, సొసైటీ బ్యాంక్ మాజీ చైర్మన్ గోలి రాజేశ్వర్ రావు, వివిధ గ్రామాల సర్పంచులు శ్రీకాంత్ రెడ్డి, సృజన, రాజు యాదవ్, గోలిపల్లి సంపత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సొసైటీ బ్యాంక్ డైరెక్టర్లు, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి వీరమల్ల రంజిత్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, హింగే శ్రీకాంత్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు శ్రీపతి లావణ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామ్ సింగ్, బొల్లెపోగు రమేష్, శనిగరపు వెంకటేష్, మండల బీసీ విభాగం మాజీ అధ్యక్షుడు నరేష్, సీనియర్ నాయకులు గోడిశాల యాదగిరి, అర్జున్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అంబాల జగన్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ప్రతినిధులు

హైద్రాబాద్, నవంబర్ 7(జై భీమ్ న్యూస్)

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నేతృత్వంలో మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతుల్లో అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అమలుకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల పదోన్నతుల్లో వర్గీకరణ చట్టాన్ని అమలు చేయడం సామాజిక న్యాయం దిశగా కీలకమైన నిర్ణయమని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా అర్హులైన ఉద్యోగులకు న్యాయం జరిగే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి. కాశీం, చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లేశంతో పాటు మాదిగ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీకి చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్ ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే వనమాడి కొండబాబు





కాకినాడ, నవంబర్ 7(జై భీమ్ న్యూస్)

మురసు తుఫాన్ ప్రభావంతో కాకినాడ నగరంలో భారీ వర్షాలు కురిసి ముంపునకు గురైన పలు ప్రాంతాలను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శనివారం నగరపాలక సంస్థ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముంపు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకుని, సహాయక చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతాప్ నగర్, ఎలివిన్ పేట, పాత బస్టాండ్, ప్రేజర్ పేట, ధనమ్మతల్లి గుడి ప్రాంతాలతో పాటు దుమ్ములపేట రైల్వే ట్రాక్ సమీపంలోని రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా నగరంలోని పలు ప్రాంతాలు నీటమునిగాయని, ముంపు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సామర్లకోట కెనాల్ ద్వారా భారీగా వరదనీరు రావడంతో కెనాల్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో ఇప్పటికీ నీరు నిలిచిపోయిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదేవిధంగా దుమ్ములపేట రైల్వే ట్రాక్ సమీపంలోని రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్ల వద్ద నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ నుంచి వచ్చే నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ముంపు సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో నగరపాలక సంస్థ ఈఈ కనకారావు, తుమ్మల రమేష్, డివిజన్ నాయకులు నీలకాయల సన్నీ, కోకా సత్తిబాబు, మెంటారావు, నానావర్పు సుబ్రహ్మణ్యం, మల్లాడి గంగాధరం, ఏరిపిల్లి రాము, మోసా పేతురు, మాది ఆండ్రియా, మల్లాడి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో మూడంచెల భద్రత

ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ బిందు మాధవ్



కాకినాడ, నవంబర్ 7(జై భీమ్ న్యూస్)

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కాకినాడలోని పిఠాపురం రాజా ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ శనివారం సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతా వ్యవస్థను తనిఖీ చేసి, విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం లోపల, వెలుపల విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సరైన అనుమతి పత్రాలు కలిగిన వ్యక్తులను మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. పోలీసు సిబ్బంది పరస్పర సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. కౌంటింగ్ ఫలితాలు వెలువడిన అనంతరం శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా కాల్చడం, గుంపులుగా గుమిగూడడం వంటి కార్యక్రమాలకు అనుమతి లేకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో అడిషనల్ అడ్మిన్ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, ఎస్బీ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ, కాకినాడ డీఎస్పీ ఎన్ఎస్‌వీకే దుర్గారావు, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే..

రైతులకు సీఎం రేవంత్ కీలక హెచ్చరిక!

సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానన్న సీఎం రేవంత్

ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులుంటాయని ప్రజలకు అప్రమత్తం

ప్రాజెక్టుల్లోని నీళ్లు తాగునీటికే సరిపోతాయని స్పష్టీకరణ

రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచన

గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ కేటీఆర్‌పై విమర్శలు

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉంటే తెలంగాణలోనే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని రేవంత్ విమర్శించారు. బావబామ్మర్దులు ఊళ్లపై పడి అబద్ధాలు చెబుతారని, వారి మాటలు విని రైతులు నష్టపోవద్దని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు. మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోసుకోకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వెళ్తున్నాయన్న బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదని సీఎం అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి నుంచి ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దించే పరిస్థితి కూడా లేదన్నారు. బీఆర్ఎస్ అవినీతి వల్లే ఈ మూడు బ్యారేజీలు పనిచేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల, వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు, ఖమ్మం జిల్లాకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పాలమూరు నుంచి గెలిచిన కేసీఆర్ భారీ బడ్జెట్ ఖర్చు చేసినా అక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే కూలిపోయిందని ఆరోపించారు. వచ్చే డిసెంబరులో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని, ఆ సమావేశాల్లో ఎల్‌నినో, కాళేశ్వరం అంశాలపై చర్చించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాలు పెంచడంపై కేటీఆర్ చేస్తున్న విమర్శలకూ సీఎం సమాధానమిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం ఇస్తోందన్నారు. హైదరాబాద్-లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కేటీఆర్ వేషభాషలు మార్చుకున్నా ప్రజలు నమ్మరని రేవంత్ ఎద్దేవా చేశారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరని వ్యాఖ్యానించారు. తాను మూడేళ్లుగా గంట కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని చెప్పారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని, అబద్ధాలు ప్రచారం చేస్తున్న కుటుంబాన్ని ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

దేవాదుల జలాలతో నిండనున్న ఎల్లాపూర్ చెరువు

పాత కాలువలను శుభ్రం చేయించి చెరువులోకి నీటి మళ్లింపు..
కాంగ్రెస్ 65వ డివిజన్ అధ్యక్షుడు నేదునూరి సునీల్ చొరవ





హసన్ పర్తి, నవంబర్ 7(జై భీమ్ న్యూస్)

ఎల్లాపూర్ చెరువులోకి దేవాదుల ప్రాజెక్టు నీటిని మళ్లించేందుకు చేపట్టిన ప్రయత్నాలు సత్ఫలితాలను ఇచ్చాయి. చెరువులో నీటి నిల్వలను పెంచి స్థానిక ప్రజలు, రైతులకు ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో పాత కాలువలను శుభ్రం చేయించి వాటి ద్వారా దేవాదుల జలాలను ఎల్లాపూర్ చెరువులోకి మళ్లించారు. ఎన్నో రోజులుగా నిరుపయోగంగా ఉన్న పాత కాలువలను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చి చెరువుకు నీరు చేరేలా చర్యలు చేపట్టడం స్థానికంగా హర్షణీయంగా మారింది. ఎల్లాపూర్ చెరువులో నీటి నిల్వలు తగ్గిపోవడంతో పరిసర ప్రాంతాల్లో వ్యవసాయం, పశువుల అవసరాలు, భూగర్భ జలాలపై ప్రభావం పడకుండా ఉండేందుకు దేవాదుల ప్రాజెక్టు నీటిని చెరువులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గతంలో నిర్మించిన పాత కాలువల్లో పేరుకుపోయిన మట్టి, పిచ్చిమొక్కలు, ఇతర వ్యర్థాలను తొలగించి నీటి ప్రవాహానికి అనుకూలంగా శుభ్రం చేయించారు. కాలువల్లో ఉన్న అడ్డంకులను తొలగించి నీరు నిరంతరాయంగా ప్రవహించేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం దేవాదుల ప్రాజెక్టు నీటిని పాత కాలువల ద్వారా ఎల్లాపూర్ చెరువులోకి మళ్లించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 65వ డివిజన్ అధ్యక్షుడు నేదునూరి సునీల్ ప్రత్యేక చొరవ తీసుకొని ఎల్లాపూర్ చెరువులోకి దేవాదుల జలాలు చేరేలా కృషి చేశారు. పాత నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా చెరువులకు నీటిని అందించవచ్చని, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్థానికులు పేర్కొంటున్నారు. చెరువులోకి దేవాదుల నీరు చేరడంతో పరిసర ప్రాంతాల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. చెరువులో నీటి నిల్వలు పెరగడం వల్ల భూగర్భ జలమట్టం మెరుగుపడే అవకాశం ఉండటంతో పాటు బోర్లు, బావుల్లో నీటి లభ్యత పెరిగేందుకు దోహదపడుతుందని భావిస్తున్నారు. వ్యవసాయ అవసరాలకు, పశువుల తాగునీటికి, పరిసర ప్రాంతాల నీటి వనరుల పరిరక్షణకు ఈ చర్యలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు, రైతులకు నేరుగా ప్రయోజనం చేకూర్చే విధంగా చెరువులు, కాలువల పునరుద్ధరణకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఎల్లాపూర్ చెరువులోకి దేవాదుల జలాలను మళ్లించేందుకు చొరవ తీసుకున్న కాంగ్రెస్ పార్టీ 65వ డివిజన్ అధ్యక్షుడు నేదునూరి సునీల్ కృషిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డెంగ్యూ బాధిత చిన్నారికి పరామర్శ.. త్వరగా కోలుకోవాలని రజనాల శ్రీహరి ఆకాంక్ష

ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా



వరంగల్ 7 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

డెంగ్యూ జ్వరంతో గత ఐదు రోజులుగా వరంగల్‌లోని ఎంజీఎం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏఐవైఎఫ్ (ూ×ఖీ) జాతీయ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి కుమార్తె సయ్యదా అలీజా ఖాద్రిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రజనాల శ్రీహరి శనివారం పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లిన ఆయన చిన్నారి తండ్రి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, కుటుంబ సభ్యులను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స వివరాలను తెలుసుకుని, చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా చిన్నారిని ఆప్యాయంగా పలకరించి ధైర్యం చెప్పిన రజనాల శ్రీహరి, ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా ఇంటికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. చిన్నారి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ కష్ట సమయంలో కుటుంబానికి తన సంఘీభావం, మద్దతు తెలిపారు. తమ కుటుంబాన్ని పరామర్శించి ఆత్మీయంగా పలకరించిన రజనాల శ్రీహరికి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

గైగోలుపాడు ఎఫ్‌సీఐ కాలనీలో తాగునీటి కష్టాలు







వీధులన్నీ వరద నీటితో నిండినా గుక్కెడు స్వచ్ఛమైన నీరు కరువు

కాకినాడ, నవంబర్ 7(జై భీమ్ న్యూస్)

ఒకవైపు మురుగు, వరద నీటితో వీధులన్నీ జలమయమవుతుండగా, మరోవైపు తాగేందుకు స్వచ్ఛమైన నీరు లేక గైగోలుపాడు ఎఫ్‌సీఐ కాలనీ, వసంత నగర్ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పథకం నీరు తాగేందుకు పనికిరాని విధంగా వస్తోందని, పసుపు, ఆకుపచ్చ రంగులో మట్టి, మలినాలు కలిసిన నీరు సరఫరా అవుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టీల్ గిన్నెలో పట్టిన నీటిని చూస్తేనే దాని నాణ్యత ఏమిటో అర్థమవుతోందని, పశువులు కూడా తాగలేని నీటిని తాము ఎలా తాగాలని అధికారులను ప్రశ్నిస్తున్నారు. కాలనీవాసుల కథనం ప్రకారం.. 2026 సంవత్సరంలో మరమ్మతుల పేరుతో సుమారు 55 రోజులపాటు నీటి సరఫరా నిలిచిపోయిందని, నీరు సరఫరా చేసిన రోజుల్లోనూ దాదాపు 30 రోజులపాటు మురికినీరు, దుర్వాసనతో కూడిన నీరు వచ్చిందని చెబుతున్నారు. ముఖ్యంగా నీటి నుంచి భరించలేని పేడ వాసన వస్తోందని, ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు తెలియజేసినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని వాపోతున్నారు. ఫిర్యాదు చేసిన ప్రతిసారీ రేపు చూస్తాం, ఎల్లుండి చూస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇంటి పన్నులు వసూలు చేయడానికి మాత్రం అధికారులు, సిబ్బంది ఇళ్ల వద్దకు వస్తున్నారని, ప్రజలకు కనీసం స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో మాత్రం నిర్లక్ష్యం కనిపిస్తోందని విమర్శిస్తున్నారు. కలుషిత నీటిని తాగడం వల్ల కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, కామెర్లు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని భయపడుతున్నారు. ఇప్పటికే కొందరు జ్వరం, కడుపు సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి వైద్యపరమైన నిర్ధారణ, నీటి పరీక్షల నివేదికలు అందుబాటులోకి రావాల్సి ఉంది. అసలు నీరు కలుషితం కావడానికి కారణం ఏమిటనే ప్రశ్న ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. తాగునీటి ట్యాంకులు సక్రమంగా శుభ్రం చేయకపోవడమా? ఫిల్టర్ యూనిట్ పనిచేయకపోవడమా? పైప్‌లైన్లలో లీకేజీలు ఉన్నాయా? క్లోరినేషన్ సక్రమంగా జరుగుతోందా? మోటార్ల ద్వారా మట్టి కలిసిన నీరు సరఫరా అవుతోందా? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. నీరు సరఫరా చేసే ప్రధాన వనరు, ట్యాంకుల నిర్వహణ, చివరిసారిగా ట్యాంకులు శుభ్రం చేసిన తేదీ, నీటి నాణ్యత పరీక్షల వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు మురసు తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా కాలనీలోని వీధులన్నీ వరద నీరు, బురదతో నిండిపోవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పక్కనే ఉన్న కాలువలో గుర్రపుడెక్క పేరుకుపోవడంతో వర్షపు నీరు సక్రమంగా వెళ్లే మార్గం లేక ప్రతి వర్షానికీ ప్రాంతం ముంపునకు గురవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలువను నామమాత్రంగా శుభ్రం చేయడం వల్ల ప్రయోజనం లేదని, పూర్తిస్థాయిలో గుర్రపుడెక్క, పూడిక తొలగించి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని కోరుతున్నారు. రోడ్లపై నిలిచిన బురద నీటిలో నడుచుకుంటూ ఉద్యోగాలకు వెళ్లడం, నిత్యావసర సరుకులు తెచ్చుకోవడం నరకప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ప్రాంతంలో ఆవులు, గేదెలు రోడ్లపై సంచరిస్తూ వాటి వ్యర్థాలతో పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయని, దీంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించి పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచాలని కోరుతున్నారు. ప్రతి పౌరుడికి స్వచ్ఛమైన తాగునీరు అందడం ప్రాథమిక అవసరమని, ఈ విషయంలో అధికారులు తక్షణమే స్పందించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, గ్రామపంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, మండల అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి వెంటనే నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే తాగునీటి ట్యాంకులు, పైప్‌లైన్లు, ఫిల్టర్ యూనిట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, పనిచేయని ఫిల్టర్లను మరమ్మతు చేయడం లేదా మార్చడం, ట్యాంకులను శుభ్రం చేయడం, పైప్‌లైన్ లీకేజీలను అరికట్టడం, క్రమం తప్పకుండా క్లోరినేషన్ చేయడం వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. నీటి పరీక్షల నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నీటి పన్నులు, ఇంటి పన్నులు వసూలు చేయడమే కాకుండా ప్రజలకు కనీస మౌలిక వసతులు, స్వచ్ఛమైన తాగునీరు అందించడం కూడా అధికారుల బాధ్యత అని కాలనీవాసులు స్పష్టం చేస్తున్నారు. వరద ముంపు, కలుషిత తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలకు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యలపై సంబంధిత అధికారుల వివరణ అందాల్సి ఉంది.

సింగరేణి ప్రాంతంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు అమెరికా ఆసక్తి

మూసివేసిన ఓపెన్‌కాస్ట్ గనుల్లో పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సింగరేణి ప్రణాళిక

హైద్రాబాద్, నవంబర్ 7(జై భీమ్ న్యూస్)

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, భారీ స్థాయిలో డేటా నిల్వ, నిర్వహణకు అవసరమైన డేటా సెంటర్ల ఏర్పాటుపై అమెరికా ఆసక్తి చూపుతోంది. ఈ క్రమంలో తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనుల ప్రాంతాలను డేటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలుగా పరిశీలిస్తున్నట్లు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా సింగరేణి పరిధిలో డేటా సెంటర్ల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అమెరికన్ కాన్సులేట్‌కు చెందిన పొలిటికల్, ఎకనమిక్ చీఫ్ మెరెడిత్ మెజ్లర్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి అధికారుల బృందం సింగరేణి సంస్థ సీఎండీ బుద్ధప్రకాశ్ జ్యోతితో సమావేశమైంది. ఈ సమావేశంలో కీలక ఖనిజాల అన్వేషణ, మైనింగ్ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పరస్పర సహకారం, ఉమ్మడి భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. మూసివేసిన ఓపెన్‌కాస్ట్ గనులను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి సంస్థ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. డేటా సెంటర్ల నిర్వహణకు నిరంతరాయంగా భారీ మొత్తంలో విద్యుత్ అవసరమవుతుందని, ముఖ్యంగా విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండే పీక్ అవర్స్‌లో కూడా నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు ఈ పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్లు దోహదపడతాయని పేర్కొన్నారు. మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన సింగరేణి సంస్థ ప్రస్తుతం కీలక ఖనిజాల రంగంలోకి కూడా ప్రవేశించిందని సీఎండీ బుద్ధప్రకాశ్ జ్యోతి తెలిపారు. ఈ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతో పాటు వివిధ దేశాలతో ఉమ్మడి భాగస్వామ్యాలు, సాంకేతిక సహకారంపై చర్చలు జరుపుతున్నట్లు వివరించారు. దీనిపై అమెరికన్ కాన్సులేట్ అధికారుల బృందం సానుకూలంగా స్పందించింది. తమ దేశంలోని కీలక ఖనిజ రంగానికి చెందిన పలు ప్రముఖ సంస్థలతో సింగరేణి కలిసి పనిచేసేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని వెల్లడించింది. ఇటీవల సింగరేణి సంస్థ కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన జియో సైన్స్ లేబొరేటరీలోని ఆధునిక సౌకర్యాలపై అమెరికన్ బృందం ప్రత్యేక ఆసక్తి కనబరిచింది. అదేవిధంగా ఓపెన్‌కాస్ట్ గనుల ఓవర్‌బర్డెన్‌లో లభించే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (అరుదైన భూ మూలకాలు) అన్వేషణ, వాటి వెలికితీతకు సంబంధించిన అవకాశాలపై కూడా చర్చించింది. ఇక వచ్చే ఏడాది ఏప్రిల్‌లో అమెరికాలో నిర్వహించనున్న కీలక ఖనిజాల అంతర్జాతీయ సదస్సులో పాల్గొనాల్సిందిగా సింగరేణి సంస్థను అమెరికన్ బృందం ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఈ సమావేశం ద్వారా సింగరేణి సంస్థకు అంతర్జాతీయ సాంకేతిక సహకారం, పెట్టుబడులు, డేటా సెంటర్ల ఏర్పాటు, కీలక ఖనిజాల అన్వేషణ వంటి రంగాల్లో కొత్త అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ సమావేశంలో అమెరికన్ కాన్సులేట్ బృందానికి చెందిన పొలిటికల్, ఎకనమిక్ స్పెషలిస్టులు శ్రీమతి కరి, శిబా త్రిపాఠి, కమర్షియల్ స్పెషలిస్ట్ సునేల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సింగరేణి పాత గనులను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా తీర్చిదిద్దడంతో పాటు, డేటా సెంటర్లు, పునరుత్పాదక విద్యుత్, కీలక ఖనిజాల రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యాలకు మార్గం సుగమం కానుంది.



HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM